క్లుప్తంగా

హ్యాట్రిక్ విజయం ఖాయం



బీఆర్ఎస్‌లో చేరిన వారితో మంత్రి హరీశ్‌రావు

మర్కూక్ (గజ్వేల్): ముచ్చటగా మూడోసారి గజ్వేల్‌లో సీఎం కేసీఆర్ భారీ మెజార్టీతో గెలుపొందడం ఖాయమని మంత్రి హరీశ్‌రావు తెలిపారు. మండలంలోని పాములపర్తికి చెందిన వివిధ పార్టీల నాయకులు శనివారం మండల పార్టీ అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి, ఎంపీపీ పాండుగౌడ్ ఆధ్వర్యంలో సిద్దిపేటలో మంత్రి హరీశ్‌రావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ గజ్వేల్‌లో ఎంతో అభివృద్ధి చేశారని కొనియాడారు.

గజ్వేల్‌లో బీజేపీదే విజయం



పార్టీలో చేరిన వారితో ఈటల రాజేందర్

మర్కూక్(గజ్వేల్): గజ్వేల్ గడ్డపై బీజేపీ జెండా ఎగురవేస్తుందని ఆపార్టీ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. శనివారం మండలంలోని పాతూరు, పాములపర్తికి చెందిన వివిధ పార్టీల నాయకులు మండల ఇన్‌చార్జి సింగం సత్తయ్య ఆధ్వర్యంలో ఈటల సమక్షంలో పార్టీలో చేరారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి కార్యకర్తను కాపాడుకుంటానని హామీ ఇచ్చారు.

ఉచిత వైద్య శిబిరం



రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ములుగు(గజ్వేల్): మండలంలోని తున్కిబొల్లారంలో గజ్వేల్ రోటరీ క్లబ్ అధ్యక్షుడు బాబుగౌడ్, సభ్యుల ఆధ్వర్యంలో మేడ్చల్ మెడినోవా సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి వైద్యులు శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 240 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు, కంటి అద్దాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి నర్సింహారెడ్డి, కోశాధికారి శ్రీనివాస్‌గౌడ్, మాజీ అధ్యక్షులు కర్ణాకర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, జగదీశ్వర్, బాపురెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ బట్టు అంజిరెడ్డి, వైస్‌చైర్మన్ నరేష్‌గౌడ్, సర్పంచ్ పావని జగదీశ్వర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ దేవేందర్‌రెడ్డి, ఎంపీటీసీ లింగారెడ్డి, సభ్యులు జమీల్, మల్లేష్‌యాదవ్, వెంకటేష్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దుర్గయ్యకు బాలసాహిత్య వికాస పురస్కారం



పురస్కారం అందుకుంటున్న దుర్గయ్య

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): బాలసాహిత్య వికాస పురస్కారాన్ని బాల సాహితీవేత్త భైతి దుర్గయ్య అందుకున్నారని ప్రముఖ బాలసాహితీవేత్త ఉండ్రాళ్ల రాజేశం శనివారం తెలి పారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, తెలుగు సాహిత్య కళా పీఠం హైదరాబాద్ రవీంద్రభారతిలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు డాక్టర్ రమణాచారి చేతుల దుర్గయ్య పురస్కారం అందుకున్నారని చెప్పారు.

భావిభారత నిర్మాతలు బాలలే

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): నేటి బాలలే రేపటి భావిభారత నిర్మాతలని ప్రముఖ విద్యావేత్త సత్యం అన్నారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం పట్టణంలోని ఓ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈసందర్భంగా విద్యార్థులు స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణలో ఆకట్టుకున్నారు.

అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలు

బెజ్జంకి(సిద్దిపేట): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే 6 గ్యారంటీలను అమలు చేసి పేదల కష్టాలు తీరుస్తామని కరీంనగర్ డీసీసీ అధ్యక్షుడు, మానకొండూర్ కాంగ్రెస్ అభ్యర్థి కవ్వంపెల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. మండలంలోని గూడెం, లక్ష్మీపూర్ గ్రామాల్లో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

వెలుగుల దీపావళి



రామకోటి రామరాజు నవధాన్యాలతో రూపొందించిన దీప జ్యోతి

గజ్వేల్‌రూరల్: వెలుగుల దీపావళి పండుగను జరుపుకునేందుకు ప్రజలు సిద్ధమయ్యారు. వ్యాపార, వాణిజ్య సముదాయాల్లో యజమానులు లక్ష్మీ పూజ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఇందుకోసం తమ దుకాణాలను శుభ్రపరిచి అందంగా ముస్తాబు చేస్తున్నారు. మార్కెట్‌లో గుమ్మడికాయతో పాటు బంతి, చామంతి తదితర రకాల పూలు, పండ్లకు గిరాకీ పెరిగింది. అలాగే మార్కెట్‌లో వివిధ రకాల ప్రమిదలను కొనుగోలు చేసేందుకు బారులు తీరారు. పట్టణంలో బాణాసంచా దుకాణాలు ఏర్పాటు చేశారు. పిల్లలు టపాసులు కాల్చే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని.. అనుకోని ఘటనలు జరిగితే వెంటనే 101, అగ్నిమాపక కేంద్రం 8500487101 నంబరుకు సమాచారం అందించాలని ఏడీఎఫ్ఓ సురేష్ తెలిపారు.

బీఆర్ఎస్ నాయకులపై తేనెటీగల దాడి



బాధితుడిని పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

నంగునూరు(సిద్దిపేట): ప్రచారం ముగించుకొని వెళ్తున్న బీఆర్ఎస్ నాయకులపై తేనెటీగలు దాడి చేశాయి. ఈఘటనలో పలువురు నాయకులతో పాటు జర్నలిస్ట్ గాయపడ్డాడు. శనివారం బీఆర్ఎస్ నాయకులు ఖానాపూర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించి నంగునూరు బయలుదేరారు. సేద తీరేందుకు తోటలోకి వెళ్లగా చెలికాని మల్లేశం, రచ్చ సిద్దు, సిద్దన్నపేట ఎంపీటీసీ తిరుపతితో పాటు ఓ పత్రికా విలేకరి కృష్ణగౌడ్‌పై తేనెటీగలు దాడి చేశాయి. వారిని నంగునూరులోని ఆస్పత్రికి తరలించారు. వారికి డ్యూటీలో ఉన్న పీజీ వైద్య విద్యార్థి ప్రథమ చికిత్స చేశారు. తీవ్రంగా గాయపడిన కృష్ణగౌడ్ ఈసీజీలో తేడా ఉందని సిద్దిపేటకు తరలించాలని చెప్పగా అప్పటికప్పుడు అంబులెన్స్ సైతం సిద్ధం చేశారు. కొద్దిసేపటికే కృష్ణను పరీక్షించి ఆరోగ్యం బాగానే ఉందని చెప్పగా గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. డ్యూటీ డాక్టర్ ఎందుకు రాలేదని నిలదీశారు. ఆరుగురు వైద్యులకు ఇద్దరు గజ్వేల్‌కు డిప్యూటేషన్‌పై వెళ్లగా మిగితా డాక్టర్లు ఐదు రోజులుగా రిజిస్టర్‌లో సంతకాలు చేయకపోవడంపై మండిపడ్డారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కొండపాక(గజ్వేల్): రోడ్డు పక్కన కూర్చున్న వృద్ధురాలిని కారు ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడింది. ఈసంఘటన కుకునూరుపల్లి మండల కేంద్రంలో శనివారం చోటు చేసుకుంది. మండలంలోని బొబ్బాయిపల్లికి చెందిన కొమురవ్వ కుకునూరుపల్లిలో వంట సామగ్రి కొనుగోలు చేసేందుకు వెళ్లి రోడ్డు పక్కన కూర్చుంది. ఈక్రమంలో కరీంనగర్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న కారు ముందు వెళ్తున్న లారీని ఓవర్‌టేక్ చేయబోయి అదుపుతప్పి రోడ్డు పక్కన కూర్చున్న వృద్ధురాలిని ఢీకొట్టడంతో రెండు కాళ్లు నుజ్జునుజ్జు అయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా మారడంతో గాంధీ ఆసుపత్రికి తరలించారు.

రాజీవ్ రహదారిపై..

రాజీవ్ రహదారిపై బైక్ అదుపుతప్పి కిందపడడంతో యువకుడు గాయపడ్డాడు. ఈసంఘటన మండలంలోని తిమ్మారెడ్డిపల్లి శివారులో శనివారం జరిగింది. చిన్నకోడూర్ మండలంలోని పెద్దకోడూర్‌కు చెందిన రాజు హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. ఈక్రమంలో పెద్దకోడూర్ నుంచి హైదరాబాద్‌కు ద్విచక్రవాహనంపై వెళ్తున్న క్రమంలో అదుపుతప్పి కిందపడిపోవడంతో కుడి చేయి విరిగింది. 108 సిబ్బంది క్షతగాత్రుడిని సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కాంగ్రెస్ పాలనలోనే సమన్యాయం



చేర్యాల మండలంలో జరిగిన ర్యాలీలో ఓటర్లకు అభివాదం చేస్తున్న కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి



ఆకునూరులో గొర్రెపిల్లతో కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

- అన్ని వర్గాల ప్రజలకు ఆర్థిక, సామాజిక భద్రత
- కాంగ్రెస్ జనగామ అభ్యర్థి 'కొమ్మూరి'

జనగామ: దేశంలో కాంగ్రెస్ పరిపాలనలోనే అన్ని వర్గాల ప్రజలకు సమ న్యాయం జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ జనగామ ఎమ్మెల్యే అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. జనగామ పట్టణంలో శనివారం పార్టీల చేరికలు, ప్రచారంలో భాగంగా ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా మాజీ మున్సిపల్ కౌన్సిలర్ బుస్సా శ్రీనివాస్ కాంగ్రెస్‌లో చేరగా ఆయనకు పార్టీ కండువా కప్పి స్వాగతించారు. ఈ కార్యక్రమంలో నాయకులు చెంచారపు శ్రీని వాస్‌రెడ్డి, ఎర్రమల్ల సుధాకర్, కంచ రాములు, చారబుడ్ల దయాకర్ రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, ఆకుల వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా కాంగ్రెస్ ఇంటింటి ప్రచారం

పట్టణంలోని 4వ, 22వ వార్డుల్లో మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి గెలుపు కోసం ఆరు గ్యారంటీ పథకాలపై అవగాహన కల్పిస్తూ ఇంటింటి ప్రచారం చేశారు. కొమ్మూరి కోడలు దివ్య, కూతురు సాయి ప్రియాంకరెడ్డి, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బడికె ఇందిర, కౌన్సిలర్లు మంత్రి సుమలత, వంగాల కల్యాణి, వేముల్ల అరుణ, మునిబేగం, సుజాత పాల్గొన్నారు. జనగామ నియోజకవర్గ కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా టీపీసీసీ రాష్ట్ర కోఆర్డినేటర్ నవీన్ పెట్టం ఆదేశాల మేరకు, నియోజకవర్గ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ పిట్టల సతీష్‌తో కలిసి కొమ్మూరి యాసారపు పరుశరాములుకు నియామకపత్రం అందించారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం కోసం శక్తి వంచన లేకుండా పనిచేస్తామన్నారు.

అవకాశం ఇస్తే.. అవినీతిరహిత పాలన అందిస్తా : కొమ్మూరి

చేర్యాల(సిద్దిపేట): కాంగ్రెస్ పాలనలోనే గ్రామాల అభివృద్ధి జరిగిందని కాంగ్రెస్ జనగామ అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని రాంపూర్, ఆకునూరు, కాశగుడిసెలు, కొత్త దొమ్మాట, సుందరయ్యనగర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మహిళలు మంగళహారతులు, బతుకమ్మలు, బోనాలతో ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో పాత పనులు తప్ప కొత్తగా చేసినవి ఏమీ లేవన్నారు. ఆదరించి అవకాశం ఇస్తే అవినీతి రహిత పాలన అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ ప్రాంత బిడ్డనైన తనకు నియోజకవర్గ ప్రజలే బలం, బలగమని అన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోను కాపీకొట్టి అమలు చేస్తామని చెబుతున్న బీఆర్ఎస్‌ను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని పేర్కొన్నారు. ఎమ్మెల్సీగా మరో నాలుగేళ్ల అవకాశం ఉన్నా అసెంబ్లీ ఎన్నికల బరిలో పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఎందుకున్నాడో ప్రజలు ఆలోచించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీ ఫ్లోర్‌లీడర్ గిరి కొండల్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్, పీఏసీఎస్ డైరెక్టర్ కొమ్ము రవి, నాయకులు రామగళ్ల పరమేశ్వర్, నర్సింగరావు, భాస్కర్‌రెడ్డి, ఆగంరెడ్డి, రఘువీర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికలప్రచార కార్యక్రమంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి



జనగామ : కొమ్మూరి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన వివిధ పార్టీల నాయకులు

పార్టీలో చేరికలు

మండల పరిధిలోని కడవేర్గుకు చెందిన పీఏసీఎస్ వైస్‌చైర్మన్ తాళ్లపల్లి నర్సయ్య, వార్డు సభ్యుడు రమేష్‌తో పాటు గ్రామానికి చెందిన పలువురు యువకులు శనివారం కొమ్మూరి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈసందర్భంగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే పట్టణానికి చెందిన పలువురు యువకులు ఆకుల నరేష్‌గౌడ్ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు.

కొమ్మూరి గెలుపు ఖాయం

నర్మెట: స్థానికుడు, నియోజకవర్గ ప్రజలకు సుపరిచితుడు జెడ్పీటీసీగా, ఎమ్మెల్యేగా సేవలందించిన కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి గెలుపు ఖాయమని కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి గంగం నర్సింహారెడ్డి అన్నారు. మండలంలోని హన్మంతాపురంలో శనివారం చేపట్టిన ఇంటింటి ప్రచారంలో కాంగ్రెస్ ఆరు గ్యారంటీ పథకాలతో పాటు గతంలో కొమ్మూరి మండలంలో చేసిన అభివృద్ధిని వివరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్, అనుబంధ సంఘాల జిల్లా, మండల స్థాయి నాయకులు దేవులపల్లి భాగ్యమ్మ, బండి అశోక్, ప్రజ్ఞాపురం శ్రీధర్, చెవుల పరశురాములు, కాల్వ అశోక్, ఇరుగు మహేందర్, ఇట్టబోయిన శేఖర్, లాలూ నాయక్, బూస అంజయ్య, మ్యాక రవి, వలబోజు శ్రీను, వలాల్ల లక్ష్మయ్య, అంజనేయులు, లొంక ప్రవీణ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

మన ప్రాంత నాయకున్ని గెలిపించుకుందాం

బచ్చన్నపేట : అసెంబ్లీ ఎన్నికల్లో మన ప్రాంత నాయకుడు కాంగ్రెస్ అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిని గెలిపించుకుందామని మండలంలోని పడమటికేశ్వాపూర్ సర్పంచ్ గిద్దెల రమేష్ అన్నారు. శనివారం గ్రామంలో మండల నాయకులు జంగిటి విద్యానాథ్‌తో కలిసి ఇంటింటా ప్రచారాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు పర్శరాములు, సంతోష్‌రెడ్డి, భాస్కర్, కరుణాకర్‌రెడ్డి, అబ్బాస్, తిరుపతి, రామాచారి, కిష్టయ్య, వినయ్, బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు .

కాంగ్రెస్‌తోనే గ్రామాల్లో అభివృద్ధి

జనగామ రూరల్: కాంగ్రెస్‌తోనే గ్రామాల్లో అభివృద్ధి జరుగుతుందని గ్రామ శాఖ అధ్యక్షుడు ఎండీ రహీం అన్నారు. శనివారం మండలంలోని పెద్దరాంచర్లలో కొమ్మూరి గెలుపు కోసం ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు కలకుంట్ల శ్యామ్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గ్యారంటీలు కాదు.. వారంటీ లేదు



బచ్చన్నపేట : అభివాదం చేస్తున్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ బండా ప్రకాష్



ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన ముదిరాజ్ కులస్తులు

- మూడు గంటల కరెంటంటున్న కాంగ్రెసోళ్లకు ఓట్లు కావాలట..
- తెలంగాణ బాగుపడిందంటే సీఎం కేసీఆర్ కృషి వల్లే..
- ఇంటింటి ప్రచారంలో బీఆర్ఎస్ జనగామ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి

జనగామ: తెలంగాణలో అధికారంలోకి వస్తే మూడు గంటల కరెంటు ఇస్తామంటున్న కాంగ్రెస్‌కు ప్రజలను ఓటు అడిగే హక్కు లేదని బీఆర్ఎస్ జనగామ ఎమ్మెల్యే అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని 1, 13, 14, 16 వార్డుల్లో ఇంటింటి ప్రచారం చేపట్టారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. అనంతరం రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్ని గ్యారంటీలు ప్రకటించినా తెలంగాణలో వారికి వారంటీ లేదని ఎద్దేవా చేశారు. ప్రత్యేక రాష్ట్రంలో కేసీఆర్ ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టిన తర్వాత అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారని అన్నారు. సాగుకు 24 గంటలు నాణ్యమైన కరెంటు సరఫరా చేస్తుంటే .. కాంగ్రెస్ నేతలు 3 గంటలు ఇస్తామంటూ సిగ్గులేని మాటలు మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. కర్ణాటకలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేని నాయకులు ఇక్కడకు వచ్చి ప్రగల్భాలు పలకడం హాస్యాస్పదమన్నారు.

ఇచ్చిన మాటకు కట్టుబడే వ్యక్తి కేసీఆర్

మాట ఇస్తే మడమ తిప్పని నేత కేసీఆర్ అన్నారు. 2014లో అధికారంలోకి వచ్చిన కేసీఆర్ ప్రభుత్వం, హామీలు, ప్రజలకు చెప్పే కార్యక్రమలు ఎన్నో అమలు చేశారన్నారు. జనగామను సిద్దిపేట, గజ్వేల్, సిరిసిల్లకు ధీటుగా తీర్చిదిద్దేందుకు శక్తి వంచన లేకుండా పని చేస్తామని చెప్పారు.

బీఆర్ఎస్‌లో భారీ చేరికలు

జనగామ మండలం శామీర్‌పేట శివారు ఉషోదయ ఫంక్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయా పార్టీలకు చెందిన నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. కాంగ్రెస్ నాయకులు సంతోష్‌రెడ్డి, మండల అధ్యక్షుడు కొన్నె మహేందర్‌రెడ్డి, యువజన విభాగం మండల అధ్యక్షులు బాల్నె సురేష్‌గౌడ్, మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎండీ. యాసిన్, వెంకిర్యాల–గోపిరాజుపల్లి ఎంపీటీసీ శాలమ్మ, ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు తదితరులు బీఆర్ఎస్‌లో చేరగా పల్లా వారికి స్వాగతం పలికారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు తాళ్ల సురేష్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ జమునలింగయ్య, రాష్ట్ర నాయకులు సిద్దయ్య తదితరులు పాల్గొన్నారు.



పల్లా రాజేశ్వర్‌రెడ్డిని సన్మానిస్తున్న పార్టీ ముఖ్యనాయకులు

ముదిరాజ్‌ల అభివృద్ధి కేసీఆర్‌తోనే సాధ్యం

బచ్చన్నపేట : ముదిరాజ్‌ల అభివృద్ధి సీఎం కేసీఆర్‌తోనే సాధ్యమవుతుందని శాసనమండలి వైస్‌చైర్మన్ డాక్టర్ బండా ప్రకాష్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎస్వీ ఫంక్షన్ హాల్‌లో ఆ సంఘం మండల అధ్యక్షుడు ఉప్పలయ్య అధ్యక్షతన జనగామ నియోజకవర్గ ముదిరాజ్‌ల ఆత్మీయ సమ్మేళనాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభ్యర్థి పల్లాతో కలిసి మాట్లాడారు. బీఆర్ఎస్ అధిక మెజార్టీతో గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

బచ్చన్నపేటలో..

మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయం వద్ద పలు గ్రామాలకు చెందిన వివిధ పార్టీల నాయకులు ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి పల్లా పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు మండల శ్రీరాములు, జల్లి సిద్దయ్య, కల్నల్ డాక్టర్ భిక్షపతి, మత్స్య శాఖ రాష్ట్ర చైర్మన్ పిట్టల రవీందర్, జిల్లా అధ్యక్షులు నీల గట్టయ్య, జిల్లా చైర్మన్ నీల రాజు, డైరెక్టర్లు పాల్గొన్నారు. అలాగే మండలంలోని కొడవటూర్ సర్పంచ్, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షులు సతీష్‌రెడ్డి పాల్గొని ఇంటింటికి తిరుగుతూ ప్రచారాన్ని నిర్వహించారు.

ప్రజల గుండెల్లో చెరగని ముద్ర

తరిగొప్పుల: సంక్షేమ పథకాలే బీఆర్ఎస్‌ను గెలిపిస్తాయని, సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారని జనగామ నియోజకవర్గ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి సతీమణి నీలిమరెడ్డి అన్నారు. శనివారం మండలకేంద్రంలో ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించి రాజేశ్వర్‌రెడ్డి గెలిపించాలని కోరారు. రాజేశ్వర్‌రెడ్డి నిత్యం నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటారన్నారు. మండల అధ్యక్షుడు పింగిళి జగన్మోహన్‌రెడ్డి, ఎంపీపీ జొన్నగోని అరితాసుదర్శన్‌గౌడ్, జెడ్పీటీసీ ముద్దసాని పద్మజావెంకట్‌రెడ్డి, వైస్ ఎంపీపీ చెన్నూరి ప్రమీల సంజీవ, సర్పంచ్ ప్రభుదాస్, లింగం, శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



జనగామ: పల్లా ఇంటింటి ప్రచారంలో జై కొడుతున్న మహిళలు

కేసీఆర్‌తోనే బంగారు తెలంగాణ

నర్మెట: సీఎం కేసీఆర్‌తోనే బంగారు తెలంగాణ సాధ్యమని ఎంపీపీ తేజావత్ గోవర్ధన్ తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. హన్మంతాపూర్, లుంబియాతండా, తెట్టెకుంట తండాల్లో పాల్గొన్నారు.

పని చేసే ప్రభుత్వానికి పట్టం కట్టాలి

మద్దూరు(హుస్నాబాద్): పనిచేసే ప్రభుత్వానికి మూడోసారి పట్టం కట్టాలని జనగామ బీఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి కుమారుడు పల్లా అనురాగ్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని లద్నూరులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అన్నివర్గాల సంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ పనిచేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మేక సంతోష్‌కుమార్, వైస్ ఎంపీపీ మల్లిపెద్ది సుమలత మల్లేశం, పీఏసీఎస్ వైస్ చైర్మన్ ఇర్రి రాజిరెడ్డి, ఎంపీటీసీ సమ్మయ్య పాల్గొన్నారు.

జనగామ రూరల్: మండలంలోని మరిగడి గ్రామంలో పార్టీ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం చేశారు. మండల నాయకుడు ఎడ్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఓటు వేయాలని పంట కల్లాల వద్దకు వెళ్లి వడ్లు పట్టి కారు గుర్తుకు వేయాలని అభ్యర్థించారు.

సంక్షిప్త వార్తలు

◆ కాంగ్రెస్‌లో చేరికలు

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలోని మర్రిముచ్చాలలో మాజీ ఎంపీపీ బుడిగె నర్సింహులు, రవి, నవీన్, భిక్షపతి ఆధ్వర్యంలో వివిధ పార్టీలకు చెందిన వందమంది కార్యకర్తలు శనివారం కాంగ్రెస్‌లో చేరారు. వారికి కాంగ్రెస్ అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి కుమారుడు రాకేష్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

◆ పార్టీలో సముచిత స్థానం కల్పిస్తాం

వర్గల్(గజ్వేల్): స్థానిక మండల పరిషత్ మాజీ వైస్ ఎంపీపీ, మజీద్‌పల్లికి చెందిన హజారి సుధాకర్‌రావు శనివారం గజ్వేల్ కాంగ్రెస్ అభ్యర్థి తూంకుంట నర్సారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీలో సుధాకర్‌రావుకు సముచిత స్థానం ఉంటుందన్నారు. ఆయనతోపాటు కాంగ్రెస్‌లో చేరిన లక్ష్మణ్ తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు సందీప్‌రెడ్డి, మాజీ ఎంపీపీ మోహన్, నేతలు రహీం, రాజు గౌడ్, సత్యం, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

◆ ఘనంగా ధన్వంతరి జయంతి

తొగుట(దుబ్బాక): నాయీబ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షుడు పయ్యావుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ధన్వంతరి జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు సురేష్, అనిల్, కరుణాకర్, శంకర్, బాలయ్య పాల్గొన్నారు.

◆ మెజార్టీ కోసం ప్రత్యేక పూజలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సిద్దిపేట అసెంబ్లీ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి హరీశ్‌రావుకు లక్షన్నర మెజార్టీ రావాలని పట్టణంలోని పాత వెంకటేశ్వర ఆలయంలో శనివారం బీఆర్ఎస్ శ్రేణులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పాల సాయిరాం, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ నందిని శ్రీనివాస్, గంప శ్రీనివాస్, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

◆ యోగాతో మానసిక ప్రశాంతత

గజ్వేల్‌రూరల్: యోగాతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని యోగా శిక్షకులు భీమేశ్వర ప్రసాద్ పేర్కొన్నారు. పిరమిడ్ వ్యవస్థాపక అధ్యక్షులు బ్రహ్మర్షి సుభాష్ పత్రీజీ జన్మదినాన్ని పురస్కరించుకొని శనివారం పట్టణంలోని సంగాపూర్ రోడ్డ మార్గంలో గల సంతోషిమాత దేవాలయం ఎదురుగా పిరమిడ్ ధ్యాన కేంద్రాన్ని ప్రారంభించారు.

◆ ప్రభాకర్‌రెడ్డిపై ఆరోపణలు సరికాదు

తొగుట(దుబ్బాక): మండలంలోని వెంకట్రావుపేట మాల సంఘం కమ్యూనిటీ భవన నిర్మానానికి ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి నిధులు మంజూరు చేయలేదని చెప్పడం సరికాదని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాంరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో శనివారం ఆయన మాట్లాడారు.

◆ సంక్షేమ ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి

సిద్దిపేటరూరల్: ప్రజల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన బీఆర్ఎస్ పార్టీని మరోసారి ఆశీర్వదించాలని సుడా చైర్మన్ రవీందర్‌రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని పుల్లూరు, బండచెర్లపల్లి, చిన్నగుండవెల్లి గ్రామాల్లో మంత్రి హరీశ్‌రావుకు మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అనంతరం గ్రామంలోని పలు కుల సంఘాలు బీఆర్ఎస్‌కు మద్దతుగా ఏకగ్రీవ తీర్మానం అందజేశారు.

◆ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

అక్కన్నపేట(హుస్నాబాద్): షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైన సంఘటన మండలంలోని ముంపు గుడాటిపల్లి పంచాయతీ పరిధిలోని జాలుబాయి తండాలో శనివారం చో టుచేసుకుంది. తండాకు చెందిన మాలోతు భిక్యానాయక్ ఇంట్లో దాచిపెట్టిన రూ.1.50 వేల నగదు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. అలాగే సుమారు ఐదు క్వింటాళ్ల బియ్యం , గృహోపకరణాలు పూర్తిగా కాలిపోయాయి. గౌరవెల్లి భూ నిర్వాసితుడు అయిన భిక్యానాయక్‌కు ప్రభుత్వం నుంచి రావాల్సిన పరిహారం అందింది. డబుల్ బెడ్రూం ఇల్లు వస్తుందనే ఆశతో తండాలోనే నివాసం ఉంటున్నట్లు బాధితుడు తెలిపాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

పాఠశాలకు సామగ్రి వితరణ

మండలంలోని వింజపల్లి ప్రభుత్వ పాఠశాలకు హైదరాబాద్‌లోని గోకరాజు గంగరాజు ఇంజనీరింగ్ కాలేజీ, శ్రీదేవి ఉమెన్స్ కాలేజీ, ఎన్‌జీఐటీ, ఎంజీఐటీ, కెఎంఐటీ కళాశాలలకు చెందిన విద్యార్థులు స్వీట్‌కాల్స్ ఆర్గనైజేషన్ ద్వారా సుమారు రూ. 4,88,946 విలువ గల సామగ్రిని శనివారం అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కృష్ణారెడ్డి, సర్పంచ్ తిరుపతిరెడ్డి, ఉపాధ్యాయులు, సీఆర్పీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

– బెజ్జంకి(సిద్దిపేట)



వింజపల్లి ప్రభుత్వ పాఠశాల వద్ద వివిధ కళాశాలల విద్యార్థులు